ప్రజాశక్తి
శనివారం 29 జూన్ 2024
5
శ్రీకాకుళం

నేడు జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జాతీయ లోక్ అదాలత్‌ను ఈనెల 29వ తేదీన నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ జిల్లా అధ్యక్షులు జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. జిల్లా కోర్టుతో పాటు ఆమదాలవలస, ఇచ్చాపురం, పలాస, పాతపట్నం, సోంపేట, టెక్కలి, కోటబొమ్మాళి, నరసన్నపేట, కొత్తూరు, పొందూరు, పాలకొండ, రాజాం కోర్టుల్లో ఆరోజున నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. లోక్ అదాలత్‌లో కేసు రాజీ అయితే ఇరు పక్షాలకూ గెలుపే ఉంటుందని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారం కోసం సుప్రీంకోర్టు ఆదేశాలనుసారం జూలై 27 నుంచి ఆగస్టు మూడో తేదీ వరకు ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వాలంటీర్ల భవితవ్యం ఏమిటి?

- పింఛన్ల పంపిణీ బాధ్యతలను అప్పగించని ప్రభుత్వం
- ఎన్నికల సమయంలోనే వారిపై కూటమి నేతల ఫిర్యాదులు
- కొనసాగింపుపై స్పష్టత కరువు
- అయోమయంలో వాలంటీర్లు

వాలంటీర్లతో భవితవ్యం అగమ్యగోచరంగా మారింది. వైసిపి ప్రభుత్వ హయాంలో నియమించిన వాలంటీర్లను పాలనలో భాగస్వామ్యం చేయకూడదని భావిస్తున్నట్లు కూటమి ప్రభుత్వం వేస్తున్న అడుగులను బట్టి తెలుస్తోంది. ఎన్నికల ముందు వరకు వాలంటీర్లే ఇంటింటికీ వచ్చి పింఛన్ సొమ్ములను అందజేసేవారు. జూలై ఒకటో తేదీ నుంచి సచివాలయ ఉద్యోగులతో డబ్బులను అందించాలని కొత్త ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. పైగా ఆ వ్యవస్థపై తొలి నుంచీ టిడిపి, జనసేన పార్టీలు తీవ్ర వ్యతిరేకతను కనబరుస్తూ వస్తున్నాయి. ఎన్నికల సమయంలో వారిని విధులకు దూరంగా ఉంచాలని కూటమి నేతలు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడం, వారిని పింఛన్ల పంపిణీకి దూరంగా ఉంచడం తటస్థించింది. తమను కొనసాగిస్తారా? లేక సాగనంపుతారా? అన్నది తెలియక వాలంటీర్ల అయోమయ పరిస్థితిలో ఉన్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

కవిటి : తమను కొనసాగించాలని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే అశోక్‌ను కోరుతున్న వాలంటీర్లు (ఫైల్)

జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయ పరిధిలో సేవలందించేందుకు మొత్తం 11,083 మంది వాలంటీర్లను గత ప్రభుత్వం నియమించింది. వారిలో పలురకాల కారణాలతో 2,319 మంది మానేశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో 8,684 మంది రాజీనామా చేశారు. వాలంటీర్లు విధుల్లో ఉంటే ఓటర్లపై ప్రభావం చూపుతారనే ఉద్దేశంతో వారిపై ఎన్నికల సంఘానికి కూటమి నేతలు ఫిర్యాదు చేయడంతో, ఏప్రిల్ నుంచి ప్రభుత్వం వారితో పింఛన్ల పంపిణీని ఆపేసింది. వాలంటీర్లనే నమ్ముకున్న వైసిపి నాయకులు వారితో బలవంతంగా రాజీనామా చేయించారు. ఎన్నికల తర్వాత వచ్చేది వైసిపి ప్రభుత్వమేనని, రాజీనామా చేసినా మళ్లీ విధుల్లోకి తీసుకుంటామని నమ్మబలకడంతో వారంతా విధుల నుంచి తప్పుకున్నారు. ఎన్నికల సమయంలో ప్రచారం, ఓటర్ల స్లిప్పుల పంపిణీ, చివరకు ఓటర్లకు డబ్బుల పంపిణీని వారితోనే చేయించారు. ఎన్నికల తర్వాత కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో వీరి భవిష్యత్ అగమ్యగోచరంగా మారింది. కొత్త ప్రభుత్వం కొనసాగిస్తుందా? తొలగిస్తుందా? అన్నది తేలకపోవడంతో వారిలో అయోమయం నెలకొంది.

వాలంటీర్ల నియామకంపై హైకోర్టులో వ్యాజ్యం

వాలంటీర్ల నియామకంపై ఇప్పటికే హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. వాలంటీర్ల నియామకాన్ని సవాల్ చేయడంతో పాటు వారిని రాజకీయ పార్టీ కార్యకలాపాల్లో పాల్గొనకుండా నిలువరించాలని కోరుతూ కడప జిల్లాకు చెందిన ఓ వ్యక్తి హైకోర్టులో పిల్ వేశారు. వైసిపి కార్యకర్తలను గ్రామ, వార్డు వాలంటీర్లుగా నియమించారని, వారి నియమకాన్ని చట్టవిరుద్ధమైందిగా ప్రకటించాలని పిల్‌లో కోరారు. హైకోర్టులో కేసు ఉండడంతో ప్రభుత్వం ఇప్పటికిప్పుడు తొలగించే అవకాశం లేదని తెలుస్తోంది. హైకోర్టు తీర్పు వెలువడిన తర్వాత దీనిపై ఒక నిర్ణయం ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు.

తొలగింపు వైపే మొగ్గు?

వాలంటీర్ల వ్యవస్థపై కూటమి ప్రభుత్వం తొలి నుంచీ వ్యతిరేకత కనబరుస్తూ వస్తోంది. వాలంటీర్లుగా ఉన్న వారంతా వైసిపి కార్యకర్తలేనని టిడిపి గట్టిగా నమ్ముతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వాలంటీర్లను కొనసాగిస్తామంటూ ఎన్నికల ప్రచారంలో హామీనిచ్చారు. పైగా వారికి నెలకు రూ.పది వేలు చెల్లిస్తామని చెప్పారు. ఎన్నికల అనంతరం ఫించన్ల పంపిణీకి వారి సేవలు అవసరమైనా, సచివాలయ సిబ్బంది ద్వారా అందించేందుకే ప్రభుత్వం నిర్ణయించడం వారి కొనసాగింపుపై అనేక సందేహాలకు తావిస్తోంది. వైసిపి కార్యకర్తలనే వాలంటీర్లుగా నియమించారని భావిస్తున్న టిడిపి, వారిని కూటమి ప్రభుత్వంలోనూ కొనసాగిస్తారని అనుకోవడం లేదని పలువురు అధికారులు సైతం తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. వాలంటీర్లను తొలగించినా వ్యవస్థను కొనసాగిస్తుందని వారు అంటున్నారు. వాలంటీర్లుగా కూటమి ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్న వారిని నియమించే అవకాశాలు లేకపోలేదని చెప్తున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న గోవిందరావు

శివారు భూములకు సాగునీరందించాలి

- వంశధార కాలువల్లో షట్టర్లు అమర్చాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని వంశధార కాలువలకు షట్టర్లు బిగించి శివారు భూములకు సాగునీరందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. నగరంలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వంశధారలో నీరున్నా రైతాంగానికి నీరందకపోవడానికి పాలకుల నిర్లక్ష్యమే కారణమని విమర్శించారు. 2009లో షట్టర్ల కుంభకోణం జరిగి 15 ఏళ్లు గడుస్తున్నా పాడైపోయిన షట్టర్ల స్థానంలో కొత్తవి వేయలేదని తెలిపారు. మరోవైపు 900 టన్నుల షట్టర్లు గోడౌన్‌లో మూలుగుతూ తుప్పు పడుతున్నాయని, వాటిని ఎందుకు బిగించడం లేదని వారు ప్రశ్నించారు. వంశధార ఎడమ కాలువకు కొత్త షట్టర్లు బిగించకుండా శివారు భూములకు నీరు ఎలా ఇస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వంశధార ఎడమ కాలువ పొడవు 105 కిలోమీటర్లలో 60 కిలోమీటర్లు అంటే హిరమండలం నుంచి టెక్కలి వరకు అన్ని షట్టర్లు, మదుములు శిథిలావస్థకు చేరుకున్నాయని చెప్పారు. వాటికి తక్షణమే మరమ్మతులు చేయకపోతే కాలువలో నీరు వెళ్లే పరిస్థితి లేదన్నారు. ఎడమ కాలువకు 68 పిల్ల కాలువలు, కుడి కాలువకు 37 పిల్ల కాలువలు పూర్తిగా మరమ్మతులకు నోచుకోలేదని విమర్శించారు. వంశధార కాలువను ఆపరేట్ చేయడానికి గతంలో 200 మంది లస్కర్స్ ఉండేవారని, నేడు 20 మంది మాత్రమే ఉన్నారని తెలిపారు. దీనివల్ల కాలువ నిర్వహణ కూడా జరిగే పరిస్థితి లేదన్నారు. లస్కర్లను నియమించాలని డిమాండ్ చేశారు. జిల్లా అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న వంశధారపై పాలకుల నిర్లక్ష్యంతో రైతాంగానికి తీవ్ర నష్టం వాటిల్లుతోందని చెప్పారు. వంశధార బ్యారేజీ పూర్తయి 50 ఏళ్లు అయిందని నిర్వహణకు నిధులు కేటాయించకపోవడంతో శిథిలావస్థకు చేరుకుందన్నారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం 50 ఏళ్లు పూర్తయిన ప్రాజెక్టులను ఆధునీకరణ చేయాల్సి ఉందన్నారు. దాని ప్రకారం వంశధార ప్రాజెక్టుకు సుమారు రూ.వెయ్యి కోట్లు అవసరం ఉంటుందని తెలిపారు. కొండపేట ఎత్తిపోతలకు పథకం మరమ్మతులు చేసి నీరందించాలి డిమాండ్ చేశారు.

కేంద్రమంత్రికి వినతిపత్రం అందిస్తున్న వాబ యోగి

ఐటిడిఎను ఏర్పాటు చేయాలి

కేంద్ర గిరిజన సంక్షేమ మంత్రికి వినతి

ప్రజాశక్తి - మెళియాపుట్టి

జిల్లాల పునర్విభజన తర్వాత ఐటిడిఎను కోల్పోయిన శ్రీకాకుళం జిల్లాలో మెళియాపుట్టి కేంద్రంగా కొత్త ఐటిడిఎను ఏర్పాటు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ అధ్యక్షులు వాబ యోగి కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి జ్యూయల్ ఓరమ్‌ను కోరారు. ఢిల్లీలో మంత్రిని శుక్రవారం కలిసి జిల్లాలో ఆదివాసీల సమస్యలపై వినతిపత్రం అందించారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో సీతంపేట కేంద్రంగా ఉన్న ఐటిడిఎ జిల్లాల పునర్విభజన తర్వాత పార్వతీపురం మన్యం జిల్లాలోకి వెళ్లిపోయిందని తెలిపారు. దీంతో శ్రీకాకుళం జిల్లాలోని మెళియాపుట్టి, కొత్తూరు, పాతపట్నం, మందస, సారవకోట తదితర మండలాల్లోని గిరిజనులకు ఐటిడిఎ సేవలు అందడం లేదన్నారు. ఆదివాసీ గ్రామాలకు రోడ్లు లేక ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అనారోగ్య సమస్యలు, గర్భిణులకు డెలివరీ సమయంలో డోలీలపైనే తీసుకెళ్లాల్సిన దయనీయ పరిస్థితులు నేటికీ ఉన్నాయని వివరించారు. సరైన సమయంలో వైద్యమందక చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. జిల్లాలో 50కి పైగా గిరిజన గ్రామాలకు రోడ్లు లేవని, ఈ గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో ఐటిడిఎ ఏర్పాటు చేయడం వల్ల కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు ఐటిడిఎకు వస్తాయని, ఆ నిధులు గిరిజన గ్రామాల అభివృద్ధికి తోడ్పడతాయని తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.గణేష్ ఉన్నారు.

వాన నీటికి అడ్డుకట్ట వేయండి

మెళియాపుట్టి : జిల్లావ్యాప్తంగా వాన నీటికి అడ్డుకట్ట వేసే పనులను పెద్దఎత్తున చేపట్టడం ద్వారా భూగర్భ జలాలు పెంపొందించేందుకు దోహదపడాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు జి.వి చిట్టిరాజు కోరారు. మండలంలోని పెద్ద పద్మాపురం పంచాయతీ పరిధిలో రాతితో కట్టిన అడ్డుకట్టలు, చెత్త సేకరణ కేంద్రాలు, ఇతర ఉపాధి హామీ పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాగులు, వంకల ద్వారా వెళ్తున్న నీటికి ఎక్కడికక్కడ అడ్డుకట్ట వేయడం వల్ల స్థానికంగా వ్యవసాయ అవసరాలు తీరడంతో పాటు భూమి లోపలకు నీరు ఇంకి భూగర్భజలాలు గణనీయ స్థాయిలో పెరుగుతాయని చెప్పారు. భూగర్భ జలమట్టం తగ్గిపోతున్న నేపథ్యంలో ఇటువంటి పనులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. బోడికొండలు, గుట్టలపై ప్లాంటేషన్ పనులు చేపట్టేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించి అంచనాలను తయారు చేయాలన్నారు. చెరువుల్లో పూడికతీత పనులకు ప్రాధాన్యతను తగ్గించాలని, ఇతర ప్రాధాన్యత పనులపై అధిక శ్రద్ధను చూపించాలన్నారు. గ్రామాల్లో నిర్మించిన చెత్త సేకరణ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని తద్వారా పారిశుధ్యం మెరుగుపడుతుందన్నారు. పర్యటనలో ఎపిఒ రవి, బి.టి నాయుడు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

'పది' సప్లిమెంటరీలో 60.32 శాతం ఉత్తీర్ణత

శ్రీకాకుళం : పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో జిల్లా 60.32 ఉత్తీర్ణతా శాతం సాధించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు తెలిపారు. జిల్లా నుంచి పరీక్షలకు 2,218 మంది విద్యార్థులు హాజరు కాగా వారిలో 1338 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారన్నారు. రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోసం జూలై ఒకటో తేదీ వరకు ప్రధానోపాధ్యాయులు www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో లాగిన్ కావాలని సూచించారు. ఆన్‌లైన్ దరఖాస్తు పూర్తి చేసి రీ కౌంటింగ్ కోసం రూ.500, రీ వెరిఫికేషన్ కోసం రూ.వెయ్యి ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించాలని చెప్పారు. విద్యార్థులు, ప్రధానోపాధ్యాయుల ద్వారా మాత్రమే ఆన్‌లైన్ దరఖాస్తులు, ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించాలని స్పష్టం చేశారు. సిఎఫ్ఎంఎస్ ద్వారా కట్టిన సొమ్ము చెల్లుబాటు కాదని తెలిపారు. మాన్యువల్, పోస్టు ద్వారా పంపిన దరఖాస్తులు అంగీకరించబోమని స్పష్టం చేశారు.

నూతన వేతన ఒప్పందంపై నిర్లక్ష్యం

- 'అరబిందో' కార్మికుల ఛార్టర్ ఆఫ్ డిమాండ్లను నెరవేర్చాలి
- సిఐటియు డిమాండ్

ప్రజాశక్తి - రణస్థలం

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి తేజేశ్వరరావు

ఎపిటోరియా ఫార్మా (అరబిందో ఫార్మా) కార్మికుల ఛార్టర్ ఆఫ్ డిమాండ్లను నెరవేర్చి, నూతన వేతన ఒప్పందం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు డిమాండ్ చేశారు. పైడిభీమవరంలోని సిఐటియు కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అరబిందో యాజమాన్యం యూనియన్‌తో చర్చలు జరిపి కార్మికుల అంగీకారంతో వేతన ఒప్పందం చేయాలని కోరుతూ పరిశ్రమ లోపల కార్మికులు ఈనెల 28న ఉదయం ఆరు గంటల నుంచి నిరసన తెలిపారని చెప్పారు. యాజమాన్యం, కార్మికులకు ప్రాతినిధ్యం వహిస్తున్న అరబిందోఫార్మా వర్కర్స్ యూనియన్ (సిఐటియు)తో చర్చలు జరిపి కార్మికుల అంగీకారంతో వేతన ఒప్పందం చేయాలని, పెంచిన వేతనం అలవెన్సు రూపంలో కాకుండా బేసిక్‌లో కలపాలని డిమాండ్ చేశారు. అరబిందో ఫార్మా యాజమాన్యం 2021లో మూడేళ్ల కాలపరిమితితో ఏకపక్షంగా ప్రకటించిన వేతనాల కాలపరిమితి 2024 మార్చితో ముగిసిందని తెలిపారు. నూతన వేతన ఒప్పందం కోసం అరబిందో ఫార్మావర్కర్స్ యూనియన్ యాజమాన్యానికి నోటీసు ఇచ్చిందని తెలిపారు. పెరిగిన ధరలతో కార్మికుల జీవనం కష్టంగా మారిందన్నారు. కంపెనీలో ఐదేళ్ల సర్వీసు దాటిన కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి కార్మికునికి అటెండెన్స్ బోనస్ రెండు సెలవులను అనుమతిస్తూ నెలకు రూ.వెయ్యి ఇవ్వాలని, సి షిఫ్ట్ అలవెన్సు రూ.50 ఇవ్వాలన్నారు. కార్మికులకు బస్సు సౌకర్యం కల్పించాలని, బస్సు సౌకర్యం లేని వారికి నెలకు రూ.1500 టిఎ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బోనస్ ఒక నెల గ్రాస్ వేతనం ఇవ్వాలని కోరారు. పరిశ్రమలో పనిచేస్తూ కిడ్నీ, కేన్సర్, పక్షవాతం తదితర వ్యాధుల బారిన పడిన కార్మికులకు యాజమాన్యం ప్రకటించిన రూ.ఐదు లక్షలు ఇవ్వాలన్నారు. అక్రమంగా తొలగించిన కార్మికులందరినీ వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గన్‌మెన్లు వద్దు

తిరస్కరించిన రవికుమార్

ప్రజాశక్తి - ఆమదాలవలస

ఎమ్మెల్యే కూన రవికుమార్ తన గన్‌మెన్లను వెనక్కి పంపారు. తన భద్రతకు ప్రభుత్వం కల్పించే గన్‌మెన్ల అవసరం లేదని స్పష్టం చేశారు. తనకు అంగరక్షకులుగా నియమించిన పోలీసు సిబ్బంది ఆయన ఇంటికి చేరుకోగా, ఆయన సున్నితంగా తిరస్కరించారు. తనకు శత్రువులు ఎవరూ లేరని, తాను అధికారంలో ఉన్నప్పటి కంటే ప్రతిపక్షంలోనే బలంగా పనిచేశానని, ప్రజల్లో నిత్యం ఉన్నానని తెలిపారు. తనకు ప్రజలతో కలిసి ఉండడమే ఇష్టమని, సాధారణ ఎమ్మెల్యేగా ప్రజలకు సేవలందిస్తానన్నారు. ఎస్‌పి ఆదేశాల మేరకు ఆమదాలవలస సిఐ, ఎస్ఐ ఆయన వద్దకు వెళ్లి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. తనకు, ప్రజలకు మధ్య అడ్డుగోడలు ఉండరాదన్న ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు కరాఖండిగా తేల్చిచెప్పారు. రవికుమార్ తీసుకున్న నిర్ణయం రాజకీయంగా చర్చనీయాంశమైంది. ఆయనకు మంత్రి పదవి రాలేదన్న ఆవేదనతోనే ఈ నిర్ణయం తీసుకున్నారని సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం సాగింది. ఈ ప్రచారాన్ని ఆయన అనుయాయులు తీవ్రంగా ఖండించారు. రవికుమార్ గన్‌మెన్లను తిరస్కరించడం ఇదే తొలిసారి కాదని తెలిపారు. ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా నామినేషన్ వేసిన ఆయనకు ఎన్నికల సంఘం ఒక అంగరక్షకుడిని నియమించినా, ఆయన తిరస్కరించారని గుర్తుచేశారు. ఎన్నికల ఫలితాల అనంతరం విజయవాడలో రవికుమార్ ఇంటి వద్దకు అంగరక్షకులను పంపగా, వారిని తిప్పిపంపారని చెప్పారు.

వంశధార నిర్వాసితులకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలి

శ్రీకాకుళం అర్బన్ : సార్వత్రిక ఎన్నికల్లో వంశధార నిర్వాసితులకు ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామన్న హామీని తక్షణమే అమలు చేయాలని నిర్వాసితుల సంఘం రాష్ట్ర కార్యదర్శి గంగరాపు సింహాచలం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. గత ప్రభుత్వం నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం వర్తింపజేస్తానని హామీనిచ్చి ప్రత్యేక ప్యాకేజీ పేరుతో కొంతమందికి డబ్బులు చెల్లించి మిగిలిన వారికి నేటికీ చెల్లించలేదని తెలిపారు. జిల్లా అభివృద్ధికి సర్వం త్యాగం చేసిన వంశధార నిర్వాసితులకు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రత్యేక ప్యాకేజీ తీసుకొచ్చి ఆదుకుంటామని చంద్రబాబు ఇచ్చిన హామీని నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. ఇచ్చిన హామీలను నమ్మి వంశధార నిర్వాసితులు కూటమి అభ్యర్థి మామిడి గోవిందరావుకు అత్యధిక మెజార్టీతో గెలిపించారని తెలిపారు.

బిసి స్టడీ సర్కిల్‌లో డిఎస్‌సి ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం

మెగా డిఎస్‌సికి హాజరయ్యే అభ్యర్థులకు బిసి స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్టడీ సర్కిల్ సంచాలకులు ఇ.అనురాధ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 27వ తేదీ నుంచి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు శ్రీకాకుళం నగరంలోని 80 అడుగుల రోడ్డులో గల బిసి స్టడీ సర్కిల్ కార్యాలయంలో నేరుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జూలై ఐదో తేదీ నుంచి ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలోని గిరిజన భవన్‌లో శిక్షణా తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. అర్హత కలిగిన 200 మంది బిసి, ఇబిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ అభ్యర్థులను ఎంపిక చేసి, వారికి 60 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణా కాలంలో 75 శాతం హాజరు కలిగిన అభ్యర్థులకు స్టైఫండ్ కింద రూ.1500, బుక్స్ అలవెన్స్ కింద రూ.వెయ్యి ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు వారి రేషన్ కార్డు, ఆధార్, బ్యాంకు అకౌంట్, కుల, ఆదాయ ధ్రువపత్రాలను తీసుకురావాలని స్పష్టం చేశారు. మరిన్ని వివరాలకు స్టడీ సర్కిల్ ఫోన్ నంబర్లు 7382975679, 9295653489, 8332852106 సంప్రదించాలని సూచించారు.

పిజి ఫలితాల్లో రుక్మిణికి ఫస్ట్ ర్యాంకు

ప్రజాశక్తి - టెక్కలి

ఆంధ్రా యూనివర్సిటీలో పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ప్రవేశ నిమిత్తం నిర్వహించిన పరీక్షల్లో టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని నీలాపు రుక్మిణి వృక్షశాస్త్ర విభాగంలో మొదటి ర్యాంకు సాధించింది. 81 మార్కులు ప్రతిభ కనబరిచింది. సంతబొమ్మాళి మండలం సీతానగరానికి చెందిన రుక్మిణి విద్యాభ్యాసం మొత్తం ప్రభుత్వ పాఠశాలల్లోనే కొనసాగింది. ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యాభ్యాసం కొనసాగించింది. 9, 10 తరగతులు నౌపడ ఉన్నత పాఠశాలలో పూర్తి చేసింది. నౌపడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ బైపిసి పూర్తి చేసి, టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరింది. వక్షశాస్త్ర వక్ష శాస్త్ర విభాగంలో 81 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ప్రథమ శ్రేణిలో నిలిచింది.

పిజి ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన రుక్మిణినిరాజమండ్రి రీజనల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ శోభారాణి, టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.గోవిందమ్మ శుక్రవారం అభినందనలు తెలిపారు. కళాశాల వృక్షశాస్త్ర అధ్యాపకులు డి.వాసుబాబుని అభినందించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సతీష్‌కుమార్, అధ్యాపకులు ఎ.రామారావు. వి.లూక్‌పాల్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రుక్మిణిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

IN THE HON'BLE COURT OF THE I ADDITIONAL JUNIOR CIVIL JUDGE VIZIANAGARAM O.S. 636/2023

Between:
State Bank of India Fort Branch represented by SRI TRILOCHAN BEHARA S/o RAGHUNADH BEHARA, aged 45, Chief Manager Fort branch Vizianagaram.
.....Plaintiff

And:
POLURU RAMAKOTI REDDY
.......Defendant

NOTICE
Hearing Date:3-07-2024

To
POLURU RAMAKOTI REDDY S/O SATYANNARAYANA REDDY, working in production department Dr. Reddy's Laboratories NH5 Industrial development area, Pydibheemavaram Ranastahlam Mandalam Srikakulam District AP

Please take notice that the above matter is posted to **03-07-2024.** You shall appear in person or through your Advocate, by **10.30 AM,** failing which the matter will be decided Ex Partee.

PVS Prasad
Advocate for the Plaintiff
Vizianagaram,
Cell:7799955633

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

ఎంట్రీలకు ఆహ్వానం



ప్రియమైన మిత్రులారా!

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా

ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి

(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ

వెంకటరమణను సత్కరిస్తున్న ఎమ్మెల్యే శంకర్

అంకితభావంతో పనిచేస్తే అందరి మన్ననలు

శ్రీకాకుళం అర్బన్: విధి నిర్వహణలో ప్రతి ఉద్యోగి అంకితభావం, నిబద్ధతతో పనిచేయడం వల్ల అందరి మన్ననలు పొందగలరని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. వైద్యారోగ్యశాఖ మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ ఉద్యోగ విరమణ సభను నగరంలోని బాపూజీ కళామందిర్‌లో శుక్రవారం నిర్వహించారు. జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ వివాదరహితునిగా అందరి మెప్పు పొందారని కొనియాడారు. అనంతరం వెంకటరమణ దంపతులకు శాలువ కప్పి సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా నివారణ అధికారి సత్యనారాయణ, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరరావు ఎపి ఎన్‌జిఒ జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం, రిటైర్డ్ జిల్లా పప్పల జగన్నాథం, మామిడి శ్రీకాంత్, డాక్టర్ ముద్దాడ చిన్నబాబు, రాష్ట్ర మాస్ మీడియా ప్రెసిడెంట్ సిహెచ్.నాగేశ్వరరావు, తెలంగాణ మాస్ మీడియా అధ్యక్షులు ఎ.ప్రసాద్, వైద్యారోగ్యశాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాలువలో పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

సాగునీరు ఇబ్బందులు లేకుండా చూడాలి

పోలాకి: ఖరీఫ్ సీజన్‌లో రైతుల వ్యవసాయ భూములకు సాగునీరు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఆదేశించారు. శుక్రవారం బొద్దాం కూడలి వద్ద కాలువలో పూడికతీత పనులు ప్రారంభం చేసారు. ఈ సందర్భంగా బొద్దాం కూడలి నుంచి డిఎల్ పురం వరకు సుమారు మూడు కిలోమీటర్ల మేరకు పనులు నిర్వహించాలని సూచించారు. మండలంలో శివారు ప్రాంతంలో ఉన్న ప్రతి ఎకరాకు సాగు నీరు అందించేలా పనులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ఎం. వెంకట అప్పలనాయుడు, మాజీ ఎంపిపి తమ్మినేని భూషణరావు, నాయకులు డోల ప్రసాదరావు, లుకలాపు రామకృష్ణ, గొర్లె యర్రయ్య, ఇలపండ ధర్మారావు, చింతు కర్రెన్న నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు పరిశీలన

కోటబొమ్మాళి: గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టి వాటర్ ట్యాంకుల్లో, బావుల్లో క్లోరినేషన్ చేసి పరిసరాలు పరిశుభ్రతే ధ్యేయంగా ప్రతిఒక్కరు పని చేయాలని టెక్కలి డిఎల్‌పిఒ ఐ.వి.రమణ అన్నారు. మండలం ఎత్తురాళ్లపాడు, శ్రీ జగన్నాథపురం పంచాయతీల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ముందుగా సచివాలయాన్ని సందర్శించి, సిబ్బందిహాజరు, రికార్డులు తనికీ చేశారు. గ్రామాల్లో ఆరోగ్య అవగాహన సర్వే చేస్తున్న సచివాలయం సిబ్బంది సర్వేపై పలు సూచనలు చేశారు. గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. మాజీ సర్పంచ్ సనపల భాస్కరరావు, గుర్రయ్య మాస్టర్ పాల్గొన్నారు.

వ్యాధులపై ముందస్తు జాగ్రత్తలు అవసరం

వజ్రపుకొత్తూరు : మాట్లాడుతున్న వైద్యాధికారులు

బూర్జ : వంట ఏజెన్సీకి అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

వాతావరణం మార్పులవల్ల సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు పాటించాలని కె.కొత్తూరు పిహెచ్‌సి వైద్యాధికారి శిష్ణు గాయత్రి అన్నారు. మండలంలో జూలై 1 నుంచి ఆగస్టు 30 వరకు స్టాప్ డయేరియా క్యాంపైన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ప్రతి గ్రామంలో ఎఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పి, ఆశా కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ఐదేళ్లలోపు పిల్లలను నమోదు చేస్తారన్నారని, ఒఆర్‌ఎస్ ప్యాకెట్లు, జింకు మాత్రలు అందజేసి చిన్నపిల్లల్లో విరేచనాలు, రాకుండా తీసుకునే జాగ్రత్తలు, నివారణా చర్యలను తల్లిదండ్రులకు వివరిస్తారన్నారు. చేతుల పరిశుభ్రత, తాగేనీరు, తల్లిపాల ప్రాముఖ్యత, భోజనం పెట్టేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తారన్నారు. పరిసరాల పరిశుభ్రత, మురుగునీరు నిల్వ లేకుండా పంచాయతీ కార్యదర్శుల సమన్వయంతో అవగాహన కల్పిస్తామన్నారు.

వజ్రపుకొత్తూరు: డయేరియా నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని గోవిందపురం పిహెచ్‌సి వైద్యాధికారులు వాహిని ప్రియాంక, వినయ్ కుమార్ సిబ్బందికి సూచించారు. డయేరియా రాకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై వైద్య సిబ్బంది, అంగన్వాడీ, గ్రామీణ నీటి సరఫరా, విద్య, సచివాలయ ఉద్యోగులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్ ధనలక్ష్మి, ఇఒ సన్యాసిరాజు, హెచ్‌ఇ తేజ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బూర్జ: పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంఎల్‌హెచ్‌పి అలేఖ్య సూచించారు. మండలంలోని పాలవలస పాఠశాలలో మధ్యాహ్న భోజన వంట ఏజెన్సీలకు పలు సూచనలు చేశారు. వర్షాకాలంలో వర్షాలు కురుస్తున్న కారణంగా వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. వంట పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రంగా లేకపోతే డయేరియా వంటి వ్యాధులు వ్యాప్తి చెందుతాయన్నారు. వంట పాత్రలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. హెచ్‌ఎం రుద్ర ప్రతాప్, ఎఎన్‌ఎం సిహెచ్ చిన్నమ్మ, ఆశవర్కర్ భవాని ఉన్నారు.

టెక్కలి: పాఠశాలల్లో విద్యార్థులు వినియోగించే తాగునీరు పరిశుభ్రత పాటించాలని కె.కొత్తూరు ప్రాథమిక ఆరోగ్య నిర్వాహకులు కె.పూజలత కోరారు. మండలంలోని చాకిపల్లి ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్ నీటి నమూనా పరీక్షలు చేపట్టారు. తాగునీటిని జిల్లా కేంద్రానికి పంపి పరీక్షలు చేపట్టనున్నట్లు తెలిపారు. పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్‌ఎం పొట్నూరు జగదీష్, కురమాన దాలయ్య, నారాయణరావు, పి.చిన్నారావు, తమ్మినేని వైకుంఠరావు, మోహిణి, జ్యోతి, నారాయణరావు, ఆశాకార్యకర్త అన్నపూర్ణ పాల్గొన్నారు.

యువతకు ఉద్యోగాలు కల్పిస్తాం

మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

ప్రజాశక్తి - లావేరు

ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు అర్హులైన నిరుద్యోగ యువతకు స్థానిక పరిశ్రమల్లో ఉద్యోగవకాశాలు కల్పిస్తామని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. శుక్రవారం మండలంలో రూ. 3.12 కోట్లు వ్యయంతో నిర్మించిన అధపాక వెంకటపురం రహదారిని ఎమ్మెల్యే ప్రారంభించారు ఈ సందర్భంగా టిడిపి మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ రహదారి సుమారు పది గ్రామాల ప్రజల రాకపోకలకు ఉపయోగ పడుతుందన్నారు. ఈ ఐదేళ్లలో నియోజకవర్గాన్ని సిఎం చంద్రబాబు నాయుడు, ప్రధానమంత్రి నరేంద్రమోదీ సహకారాలుతో అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు. బుడుమూరు నారాయణ సాగరాన్ని మినీ రిజర్వాయర్‌గా చేస్తామని, ఎస్ఎంపురం పెద్ద చెరువుకు మడ్డువలస జలాశయం నీరు తీసుకువెళ్లి రైతాంగానికి సాగునీటిని అందజేస్తామన్నారు. లావేరు, జి.సిగడాం మండలాలు పూర్తిగా వ్యవసాయాధారిత మండలాలని వీటికి ఏడాదిలో తోటపల్లి, మడ్డువలస రిజర్వాయర్‌ల నుంచి సాగునీరు పూర్తి స్థాయిలో అందజేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎఎంసి చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, జనసేన ఇన్‌ఛార్జి విశ్వక్సేన్, మాజీ ఎంపిపి మీసాల వెంకటరమణ, కిల్లారి నాగేశ్వరరావు, మాజీ జెడ్‌పిటిసి పి.మధుబాబు, లుకలాపు అప్పలనాయుడు, పిఆర్ డిఇ సీతం నాయుడు, ఎఇ హేమలత, కునపల్లి దామోదరరావు, ఆరేళ్ల కృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

విద్యాప్రమాణాలు మెరుగుకు కృషి

ఎన్‌డిఎ కూటమిలో సిఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో విద్యాప్రమాణాలు మెరుగుకు కృషి చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే ఎన్ఇఆర్ అన్నారు. మండల కేంద్రం లావేరులో జెడ్‌పి పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వంటలు నాణ్యత పాటించాలన్నారు. అనంతరం పాఠశాల ముఖద్వారం వద్ద అసంపూర్తిగా ఉన్న కాలువను పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. స్థానిక వస్త్రపురి కాలనీ మహిళలు తమకు గత కొన్ని రోజులుగా తాగునీరుకు ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా తాగునీరు ఇబ్బందులు లేకుండా రెండు రోజుల్లో చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈయన వెంట ఎంఇఒ మురళీకృష్ణ, హెచ్‌ఎం శ్రీనువాసరావు తదితరులున్నారు.

గత ఐదేళ్లలో మున్సిపాలిటీ అభివృద్ధి శూన్యం

సమావేశంలో మాట్లాడుతున్న శిరీష

ప్రజాశక్తి - పలాస

గత ఐదేళ్లలో గతితప్పిన పాలనతో పలాసను చీకటిమయం చేశారని ఎమ్మెల్యే గౌతు శిరీష ఆక్షేపించారు. టిడిపి కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయకర్త వెంకన్న చౌదరి ఆధ్వర్యంలో టిడిపి నాయకులతో శుక్రవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు న్యాయం చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. ప్రతివార్డు కౌన్సిలర్, ఇన్‌ఛార్జిలు చురుగ్గా పని చేయాలని కోరారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబురావు మాట్లాడుతూ వెయ్యికిపైగా టిడ్కో ఇళ్లను పూర్తి చేసి అలాగే వదిలేశారని, ఆ ఇళ్ల కోసం డిడిలు తీసిన లబ్దిదారులకు బలవంతంగా జగనన్న కాలనీలో స్థలాలను కట్టబెట్టారన్నారు. చాలా మంది డబ్బులు కట్టి ఇబ్బందులు పడుతున్నారని, వారందరికి టిడ్కో ఇల్లు ఇవ్వాలని కోరారు. కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్ మాట్లాడుతూ మెప్మా విభాగంలో అవినీతి జరుగుతోందని ఆరోపణలు వెల్లువత్తుతున్నాయని ఆ దిశగా దృష్టి సారించాలని కోరారు. మాజీ వైస్ చైర్మన్ మాట్లాడుతూ తాత్కాలిక రైతు బజార్, నీటి సమస్యలను ప్రస్తావించారు. గతంలో రైతు బజార్‌కు పునాది వేసిన స్థలంలోనే రైతు బజార్ నిర్మించాలన్నారు. పారిశుద్ధ్యం పనులు సక్రమంగా జరగడం లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలపై సానుకూలంగా శిరీష స్పందిస్తూ సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

సంక్షిప్త వార్తలు

పిజిలో విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి - ఆమదాలవలస

పట్టణంలోని డిగ్రీ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో జరిగిన పిజి సెట్ ఫలితాల్లో తమ సత్తాచాటారు. చరిత్ర విభాగంలో జె.నవీన్‌కు 19వ ర్యాంకు, వాణిజ్యశాస్త్ర విభాగంలో కె.రసజ్ఞ 24 ర్యాంకు సాధించారు. అలాగే రాజనీతి శాస్త్ర విభాగంలో బి.సంతోష్ కుమార్‌కు 99వ ర్యాంకు, అర్థశాస్త్ర విభాగంలో ఎస్.లోకేష్‌కు 177 ర్యాంకు, రాజనీతి శాస్త్ర విభాగంలో జి.మణికంఠకు 302వ ర్యాంకు, చరిత్ర విభాగంలో ఎన్.మీనా కుమారి 332వ ర్యాంకును, వాణిజ్య శాస్త్ర విభాగంలో కె.గణేశ్వరరావు 458వ ర్యాంకును కైవసం చేసుకున్నారు. విద్యార్థులు ర్యాంకులు సాధించడంపై కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ఎస్ఎన్ స్వామి, కళాశాల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

ఇకెవైసి తప్పనిసరి

కవిటి: భారత ప్రభుత్వ సూచనల మేరకు గ్యాస్ వినియోగదారులందరూ తప్పనిసరిగా ఇకెవైసి చేసుకోవాలని మండల భారత్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధులు కె.వెంకటరావు, ఎం.ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి తమ గుర్తింపు కార్డు లేదా వేలిముద్ర స్కానర్ ద్వారా తమవద్దకు వచ్చే గ్యాస్ డెలివరీ వ్యక్తుల వద్ద ఇకెవైసి చేసుకోవాలని కోరారు. లేదంటే గ్యాస్ పుస్తకం, ఆధార్ కార్డుతో కవిటిలో ఉన్న భారత్ గ్యాస్ కార్యాలయానికి వచ్చి చేసుకోవాలని సూచించారు. దీనికోసం ఎటువంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదని, వినియోగదారులు గ్యాస్ కార్యాలయంలో నమోదు చేసుకున్న ఫోన్ నెంబరుకు ఒటిపి చేరడం ద్వారా భద్రత పొందాలని సూచించారు. అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉచిత గ్యాస్ సిలిండర్లు పొందడానికి కూడా ఇకెవైసి ఉపయోగ పడుతుందని తెలిపారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలన్నారు.

ఆదాయ అభివృద్ధికి రుణాలు

ఆమదాలవలస: స్వయంశక్తి సంఘాల్లో పంచసూత్రాలు పాటిస్తూ ఆదాయాభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్న సంఘాలకు మైక్రో క్రెడిట్ ప్లాన్ ప్రకారం కావాల్సినంత రుణం మంజూరు చేస్తామని స్టేట్‌బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ కామేష్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో వెలుగు ఎపిఎం పైడి కూర్మారావుతో కలిసి మాట్లాడారు. స్వయంశక్తి సంఘాల్లోని మహిళలు ఆదాయాభివృద్ధి కార్యక్రమాలకు స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా విరివిగా రుణాలు మంజూరు చేస్తుందని, ఈ అవకాశాన్ని స్వయం సహాయక సంఘ మహిళలు వినియోగించుకోవాలని కోరారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు తమ్మినేని ధనలక్ష్మితో పాటు క్లస్టర్ కో-ఆర్డినేటర్ రమణ పాల్గొన్నారు.

పర్యావరణంపై అవగాహన పెంచుకోవాలి

పొందూరు: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు పర్యావరణంపై అవగాహన పెంపొందించు కోవాలని తాడివలస జెడ్‌పిహెచ్ఎస్ హెచ్ఎం బల్ల కంటయ్య అన్నారు. శుక్రవారం పాఠశాల 6వ తరగతి విద్యార్థిని పూజారి హాసిని పుట్టినరోజు సందర్భంగా పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థుల పుట్టినరోజున మొక్కలు నాటే కార్యక్రమాన్ని సాంప్రదాయంగా చేపడుతుండడం ఎంతో గర్వించదగిన విషయమని పలువురు ఉపాధ్యాయులు అన్నారు.

బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు

ఇచ్ఛాపురం: పట్టణంలో మార్కెట్, బేకరీలు, షాపుల్లో పని చేస్తున్న బాలకార్మికులను అధికారులు గుర్తించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గోపాలకష్ణ, లేబర్ ఆఫీసర్ విజయ్ కుమార్, చైల్డ్ హెల్ప్‌లైన్ ప్రతినిధి స్వాతి, అప్పలనాయుడు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని విద్యాధరి డిగ్రీ కాలేజ్‌లో జెసిఐ శ్రీకాకుళం మెయిన్ ఆధ్వర్యాన శుక్రవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని డాక్టర్ బొడ్డేపల్లి సురేష్, డాక్టర్ సింధూర ప్రారంభించారు. శ్రీకాకుళం న్యూ బ్లడ్ బ్యాంకు సహకారంతో చేపట్టిన ఈ శిబిరంలో 60 మంది మహిళలు, విద్యార్థులు రక్తదానం చేశారు. శిబిరంలో జెసిఐ వ్యవస్థాపక అధ్యక్షులు జామి భీమశంకర్, ప్రస్తుత అధ్యక్షులు కూన.అనిల్ కుమార్, జెసిఐ సన్‌రైజర్స్ ఉపాధ్యక్షులు సింగూరు ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగులు వితరణ

ఇచ్ఛాపురం: పట్టణంలో ఉన్న బెల్లుపడా మున్సిపల్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన రెయ్యా జానకిరావు రెడ్డి బ్యాగులు, బట్టలు, షూలు వితరణగా అందించారు. కార్యక్రమంలో ఆర్.సత్యవతి, చిరంజీవులు రెడ్డి, గిన్ని చిన్న, తిప్పన కూర్మారావు, కొచ్చర్ల దాలమ్మ, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

'డిఇఒ' మెరిట్ లిస్టు విడుదల చేయాలి

కవిటి: ఎపిపిఎస్‌సి ఎపిపిఎస్‌సి నిర్వహించిన డిఇఒ ప్రిలిమ్స్ ఫలితాల్లో సమతూకం పాటించకుండా రిజర్వేషన్ లాకి వ్యతిరేకంగా ఉందని పలువురు అభ్యర్థులు ఆరోపించారు. తక్షణమే జరిగిన పొరపాటు గుర్తించి అభ్యర్థులందరికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం తమ నిరసన తెలియజేస్తూ మార్కులతో కూడిన మెరిట్ లిస్ట్ విడుదల చేయాలని కోరారు. అదే విధంగా సామాజికవర్గ ప్రాతిపదికగా మెయిన్స్‌కి ఎంపిక చేసి 1:50 లేదా 1:100 అనేది రూల్స్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం క్యాస్ట్‌కి వర్తింప చేయాలన్నారు. ముఖ్యంగా నోటిఫికేషన్‌లో ఉన్న సిలబస్ ప్రకారం పరీక్ష పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎం.మురళీ ప్రకాష్, జి.మన్మథరావు, ఎస్.రవికుమార్, ఎల్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కిట్లు పంపిణీ

విద్యార్థులకు కిట్లను అందజేస్తున్న శ్రీనివాసరావు, నాయకులు

రణస్థలం రూరల్: ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందుతాయని సర్పంచ్ నడుకుదిటి రజని అన్నారు. మండలంలోని బంటుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, పాఠ్య పుస్తకాలతో కూడిన కిట్లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి టి.సంజీవరావు, వార్డుమెంబర్ గురాల కరుణ, టి.అప్పలరాజు, హెచ్‌ఎం బి.వి.రమణమూర్తి, ఉపాధ్యాయులు డి.కోటేశ్వరరావు, పి.గురునాయుడు, ఎస్.చక్రధర్, నిర్మల, ధనలక్ష్మి, దుర్గాప్రసాద్, జగదీశ్వరి పాల్గొన్నారు.

పొందూరు: కృష్ణాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో సర్పంచ్ ప్రతినిధి అంబళ్ల శ్రీనివాసరావు విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, పాఠ్య పుస్తకాలతో కూడిన కిట్లును పంపిణీ చేశారు. హెచ్‌ఎం రేణుక, జనసేన నాయకులు గార బాబూరావు, టిడిపి నాయకులు కె.పైడినాయుడు, దాలినాయుడు, సురేష్, నరసింహమూర్తి, చిత్తిరి గోవింద, కురిటి బంగారి, రాజు పాల్గొన్నారు.

సిపిఆర్‌పై అవగాహనా సదస్సు

సిపిఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యులు సంతోష్

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

అత్యవసర పరిస్థితుల్లో గుండెపోటుతో స్పృహతప్పి ప్రాణాపాయం స్థితిలో సిపిఆర్ చేయడం వలన ప్రాణాలు కాపాడుకోవడానికి దోహదపడుతుందని డాక్టర్ వెచ్చ సంతోష్ అన్నారు. శుక్రవారం స్థానిక కస్తూరి భా గాంధీ విద్యాలయంలో జెసిఐ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు సిపిఆర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. అత్యవసర సమయంలో ఎవరికైనా ప్రథమ చికిత్స ద్వారా కాపాడుకోవడానికి వీలు కలుగుతుందన్నారు. ఈ మధ్య కాలంలో ఎక్కువగా గుండెపోటు వచ్చి మరణాలు చూస్తున్నామని, దీనిని అధిగమించడానికి గుండెపోటు వచ్చినపుడు రెండు నిమిషాల సిపిఆర్ చేసి కాపాడుకోవచ్చు అని విద్యార్థులకు, అధ్యాపక సిబ్బందికి ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. విద్యార్థులచే డెమో చేయించారు. కార్యక్రమంలో అధ్యక్షులు షణ్ముకరావు, నవీన్, కాళ్ల జయదేవ్, రాజకుమార్, ప్రిన్సిపాల్ పి.శిరీష, సత్యవతి, జగదేశ్వరి, టెంకలా లక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమణ బడ్డీలు తొలగింపు

అర్ధరాత్రి పట్టణంలోని బడ్డీలను తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు

ప్రజాశక్తి - ఆమదాలవలస

పట్టణ నడిబొడ్డున ఉన్న కూరగాయల మార్కెట్ ముందు భాగంలో గత వైసిపి ప్రభుత్వంలో అక్రమంగా వెలిసిన బడ్డీలను గురువారం రాత్రి శుక్రవారం సాయంత్రం మున్సిపల్ అధికారులు తొలగించారు. ఏడాది క్రితం అప్పటి వైసిపి ప్రభుత్వ పెద్దలు తమ అనుచరులకు 16వ వార్డు పరిధిలో ఉన్న ప్రధాన రహదారి ప్రక్కన ఉన్న కూరగాయల మార్కెట్ ముందు భాగంలో ఆరు దుకాణాలను ఏర్పాటు చేసుకునేందుకు మున్సిపల్ అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి అనుమతులు మంజూరు చేశారు. ఇటీవల కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఎమ్మెల్యే కూన రవికుమార్ మున్సిపల్ అధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేసి కూరగాయల మార్కెట్‌కు ముందు భాగంలో అడ్డంగా ఉన్న ఆక్రమణ బడ్డీలను తొలగించాలని అధికారులను ఆదేశించడంతో గురువారం రాత్రి ఐదు దుకాణాలను శుక్రవారం సాయంత్రం ఒక దుకాణాన్ని మున్సిపల్ అధికారులు తొలగించి ఆ బడ్డీలను వేరే చోటకు తరలించారు. అలాగే గతంలో పట్టణంలోని పట్టణ శివారులో ఉన్న చాలా ప్రభుత్వ భూములు అన్యాక్రాంత మయ్యాయని బినామీల పేరిట పట్టాలు మంజూరయ్యాయని, వాటిపై విచారణ చేసి ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని పౌర సమాజం నాయకులు, పట్టణ ప్రజలు కోరుతున్నారు.

అప్పలాచార్యులు అందరికీ ఆదర్శం

అప్పలాచార్యులు దంపతులను సన్మానిస్తున్న గ్రామస్తులు, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - సోంపేట

ఉద్యోగం అంటే విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దేందుకు వచ్చిన ఒక మంచి అవకాశంగా భావించి జీవితాంతం వారి అభివృద్ధికి తన బోధనను అంకితం చేసిన మండ అప్పలాచార్యులు మాస్టారు జీవితం అందరికీ ఆదర్శమని వక్తలు కొనియాడారు. ఈ నెల 30న ఉద్యోగ విరమణ చేయుచున్న మాస్టారు జీవితంలో ఘట్టాలు నేటితరం ఉపాధ్యాయులకు మార్గదర్శకం కావాలని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. 1962లో ఆమదాలవలస మండలం నెల్లిమెట్టలో జన్మించారు. నలుగురు అన్నదమ్ములు, ముగ్గురు అక్కాచెల్లెళ్లు. అన్నదమ్ములందరూ ఉపాధ్యాయ వృత్తిని చేపడుతున్నారు. 1989లో ఈయన ఉపాధ్యాయ వృత్తిని చేపట్టారు. పొందూరు మండలం బొడ్డపల్లి స్కూల్‌లో పనిచేశారు. తరువాత సరుబుజ్జిలి ఎంపిపి స్కూల్‌లో పనిచేశారు. అనంతరం ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంగా పదోన్నతి పొంది మందస మండలం బైరిసారంగపురం గ్రామానికి బదిలీపై వచ్చి ప్రస్తుతం అక్కడే విధులు నిర్వహిస్తూ ఈ నెల 30న ఉద్యోగ విరమణ చేయనున్నారు.

కుటుంబ నేపథ్యం

ఈయనకు 1990లో వివాహం జరిగింది. భార్య చంద్ర కళావతి గృహిణి. కుమారుడు భానుప్రతాప్, కుమార్తె మౌనిక, అల్లుడు అనిల్ కుమార్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. స్వగ్రామం రాగోలులో నివసిస్తున్నారు.

యువకుల ఘర్షణ

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

టెక్కలి జెడ్‌పి రోడ్డు వెలుగు కార్యాలయం సమీపంలో శుక్రవారం మధ్యాహ్నం కొందరు యువకులు బాహాబాహికి దిగారు. గోపినాథపురం ప్రాంతానికి చెందిన పలువురు వ్యక్తులకు, నందిగాం మండలానికి చెందిన ఓ యువకుడికి మధ్య చోటుచేసుకున్న గొడవ తీవ్ర వాగ్వావాదానికి దారితీసింది. పోలీసులు వచ్చి ఇరువర్గాలను పోలీసులు స్టేషన్‌కు తరలించారు.

సభ్యత్వ నమోదులో పాల్గొన్న ఉపాధ్యాయులు

ఎపిటిఎఫ్ సభ్యత్వ నమోదు

మెళియాపుట్టి: మండలం గొప్పిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల శాఖ అధ్యక్షులు టి. కామేశ్వరరావు ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. సంఘం బలోపేతానికి ఎపిటిఎఫ్ కృషి చేస్తుందన్నారు. సంఘ సభ్యత్వం విస్తృతంగా నమోదు చేయాలని కోరారు. ఈ సందర్భంగా కామేశ్వరరావు మాట్లాడుతూ సంఘ బలోపేతానికి తగిన మార్పులు కారణంగా నెలకొన్న ఉపాధ్యాయ సమస్యలపై మాట్లాడారు. జిఒ 117 విలీనం రద్దు చేయాలని, తల్లికి వందనం ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు వర్తించేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రవికుమార్, జిల్లా ఉపాధ్యక్షులు ఢిల్లేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ధర్మారావు, కౌన్సిలర్ చక్రధర్, కార్యదర్శి ఢిల్లేశ్వరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థిని సన్మానిస్తున్న రామరాజు తదితరులు

విద్యార్థికి సన్మానం

ప్రజాశక్తి - పాతపట్నం

మండలం ఎస్.ఎస్.మనుగు ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం తమ్మినైనా అన్నాజీరావు అధ్యక్షతన పాతపట్నంకు చెందిన రామరాజు ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పారశెల్లి రామరాజు ఆధ్వర్యంలో ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో 2023-2024లో 10వ తరగతి పరీక్షల్లో మండల టాపర్‌గా 520/600 మార్కులు సాధించిన సవర చరణ్ కుమార్‌కు నగదు పురస్కారం, జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ ఉపాధ్యాయు లందరూ కలిసి పనిచేస్తేనే విజయాలు సాధించగలరన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు టి. అబ్బాయి, ప్రశాంత్ కుమార్ పండా, పి.కోటేశ్వరరావు, టి.సింహాచలం, కె.సోమేశ్వరరావు, కె.వెంకటేశ్వరరావు, ఎస్.దేమ్మడు, పి.జీవనరావు, సిహెచ్ కేశవరావు, బి.రామయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి - పాతపట్నం

మండలం బోరుభద్రలో సర్పంచ్ సవిరిగాన శ్రీదేవి ఆధ్వర్యంలో శ్రీకాకుళం జెమ్స్ ఆస్పత్రి సౌజన్యంతో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఎముకలు, గర్భిణులు, కళ్లు, చిన్న పిల్లల సమస్యలు, జనరల్ మెడిసిన్ సమస్యలకు చికిత్స అందించారు. సుమారు 300 మంది ఈ సేవలు పొందారు. ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసిన సర్పంచ్ శ్రీదేవికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. వైద్యులు తేజప్, ఆస్పత్రి సిబ్బంది, సవిరిగాన శ్రీనివాసరావు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

మరమ్మతు పనులు ప్రారంభం

ప్రజాశక్తి - రణస్థలం రూరల్

తోటపల్లి కాలువ తక్షణ మరమ్మతు పనులను శాసనసభ్యులు నడుకుదిటి ఈశ్వరరావు ప్రారంభించారు. తోటపల్లి కాలువలో నియోజకవర్గం ప్రారంభ ప్రాంతమైన బిపి వరకట్టు 12వ నెంబర్ కిలోమీటర్ నుంచి 10వ కిలోమీటర్ వరకు పూడికలు ఉండిపోవడంతో గత నాలుగేళ్లుగా రైతులకు నీరు రానిపరిస్థితి నెలకొంది. ఈ సమస్యను రైతులు వెంటనే ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన అయన తోటపల్లి డిఇఇ హరిప్రసాద్, జెఇ రామలక్ష్మితో మాట్లాడి శుక్రవారం తక్షణ మరమ్మతు పనులను స్థానిక రైతులు, నియోజకవర్గ కూటమి నాయకుల సమక్షంలో ప్రారంభం చేసారు. ఈ మూడు కిలోమీటర్లు పూడికలు తీసిన వెంటనే రైతులకు సాగునీరు అందుతుందని అధికారులు ఎమ్మెల్యేకి వివరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పిసిని జగన్నాథం నాయుడు, పి.భానోజీనాయుడు, ముప్పిడి సురేష్ కుమార్, డిజిఎం ఆనందరావు, లెంక శ్యాం, వెలిచేటి సురేష్ కుమార్, ఇనపకుర్తి తోటయ్యదొర, బాలి శ్రీను, కోట్ల ఈశ్వరారావు, వి.జె.ఎస్.ఎల్.పి మౌళి, లెంక నారాయణరావు, మాతా అప్పారావు పాల్గొన్నారు.

ఆర్‌టిసి బస్సు ప్రారంభం

ప్రజాశక్తి - సరుబుజ్జిలి

మండలం యరగాంకు శుక్రవారం నుంచి ఆర్‌టిసి బస్సు ప్రారంభం కావడంపై టిడిపి యువ నాయకులు గురువు తిరుమలరావు, గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఈ గ్రామం నుంచి ఆమదాలవలస, శ్రీకాకుళం పట్టణాలకు ఆర్‌టిసి బస్సు సౌకర్యం ఉండేదని, తమ గ్రామంతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన సుమారు 15 గ్రామాలకు రవాణా సౌకర్యం ఉండేదన్నారు. గత కొంతకాలం నుంచి ఆర్‌టిసి అధికారులు వివిధ కారణాలతో బస్సును నిలుపుదల చేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. తమ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని ఇటీవల కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే కూన రవికుమార్‌ను కలిసి సమస్య పరిష్కరించాలని కోరగా స్పందించి అధికారులతో మాట్లాడి రవాణా సౌకర్యం కల్పించారన్నారు.

ప్రారంభిస్తున్న ఆర్‌టిసి బస్సు

కేన్సర్‌ను మొదటి దశలో గుర్తిస్తే మేలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

కేన్సర్ వ్యాధిని మొదటి దశలో గుర్తిస్తే ప్రాణాలతో బయట పడగలరని రిమ్స్ వైద్యులు డాక్టర్ సత్యస్వరూప్ తెలిపారు. నగరంలోని సన్‌షైన్ స్కూల్లో లైన్స్‌క్లబ్ ఆఫ్ హర్షవల్లి ఆధ్వర్యాన చైల్డ్‌హుడ్ కేన్సర్‌పై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన హాజరై మాట్లాడుతూ గుండెపోటు తర్వాత ప్రపంచ వ్యాప్తంగా అత్యధిక మరణాలు కేన్సర్ వలనే సంభవిస్తున్నాయన్నారు. ఔషధాలు, చికిత్స ఉన్నప్పటికీ, సకాలంలో గుర్తించకపోతే కేన్సర్ ప్రాణాంతక మవుతుందన్నారు. దీనిని ప్రారంభ దశలోనే గుర్తించడం వలన సకాలంలో వైద్యం అందించడానికి వీలవుతుందన్నారు. విడువని దగ్గు, పేగుల కదలికల్లో మార్పులు, గడ్డలు, వాపులు, పుట్టుమచ్చల్లో మార్పులు, కారణం లేకుండా బరువు తగ్గడం, తగ్గని నొప్పులు, ఆహారం మింగడానికి ఇబ్బంది పడడం, మూత్రంలో రక్తం పడడం తదితర లక్షణాలు కేన్సర్ వ్యాధి బారిన పడిన వారిలో కనిపిస్తుందన్నారు. ముఖ్యంగా చిన్నారులు నిల్వ ఉంచిన ఆహారాన్ని తీసుకోవడం వలన, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో లభించే ఆహార పదార్థాలను తీసుకోవడం

కేన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న సత్య స్వరూప్

వలన వ్యాధి సోకే ప్రమాదముందన్నారు. ఆహారపు అలవాట్లలో మార్పులు కూడా కేన్సర్ వ్యాధికి కారణం అవుతుందన్నారు. లైన్స్ క్లబ్ హర్ష వల్లి జోనల్ చైర్మన్ కరణం శోభారాణి మాట్లాడుతూ చిన్నారులు తల్లిదండ్రులకు, పెద్దలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సదస్సులో విశ్రాంత అడిషనల్ డిఎంహెచ్ఒ డాక్టర్ చింతాడ కృష్ణ మోహన్, ఉపాధ్యాయులు వావిలపల్లి జగన్నాథ నాయుడు, సన్‌షైన్ స్కూల్ ప్రిన్సిపాల్ ప్రదీప్, ట్రెజరర్ తర్లాడ అప్పల నాయుడు, మజ్జి సుమన్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శివరాం ప్రసాద్

117 జిఒ రద్దు చేయాలి

ప్రజాశక్తి - రణస్థలం

2003 డిఎస్‌సి ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఆపస్ జిల్లా అధ్యక్షులు దుప్పల శివరాం ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం మండల కార్యవర్గ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మెమో 57ను అనుసరించి 2003 డిఎస్‌సి ఉపాధ్యాయులకు పాత పింఛను విధానం అమలు చేయాలన్నారు. ప్రాథమిక విద్యకు పూర్తి విఘాతం కల్పిస్తున్న జిఒ నంబరు 117ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సంఘ మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా గురుగుబెల్లి చిన్నికృష్ణం నాయుడు, ప్రధాన కార్యదర్శిగా సింగుపురం రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో సంఘ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్.సత్యం, జి.వి గిరి, ఎస్.శ్రీధర్, ఎం.రవిభట్లు తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఒలకు సూచనలు చేస్తున్న తహశీల్దార్ సురేష్

కుల ధ్రువీకరణ పత్రాలు జారీ

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ప్రభుత్వ ఆదేశాల మేరకు అందరికీ కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తామని తహశీల్దార్ ఎం.సురేష్ అన్నారు. శుక్రవారం కుల ధ్రువీకరణ పత్రాల సుమోటో సేవలను ఆయన పరిశీలించారు. మెట్టూరు, గునిపల్లి, బీపురుపల్లి గ్రామాల్లో రెవెన్యూ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో సుమోటో సేవలను పరిశీలించి పలు సూచనలు చేశారు. లబ్ధిదారులు ఆధార్, రేషన్ కార్డులు అధికారులకు చూపిస్తే వెంటనే విచారణ జరిపి ధ్రువపత్రాలు జారీ చేస్తామన్నారు. ప్రతి గ్రామంలో అధికారులు సుమోటో సేవలు అందిస్తారన్నారు. ఉప తహశీల్దార్ గిరిరాజ్, వీఆర్‌ఒలు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై అవగాహన

ప్రజాశక్తి-ఇచ్ఛాపురం

శాంతినికేతన్ హైస్కూల్‌లో శుభ్రత పరిశుభ్రత కార్యక్రమంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి చైర్మన్ డి.కృష్ణమూర్తి రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణం దృష్ట్యా పిల్లలందరు ప్రతిరోజు భోజనం ముందు, భోజనం తరువాత రెండు చేతులను శుభ్రంగా కడుక్కోవాలని, చుట్టూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. బయట వస్తువులను తిన కూడదన్నారు. స్కూల్ మేనేజర్ కె. సి. పూరి, ఉపాధ్యాయులు శంకర్ శ్రీధర్, రోజా, స్నేహ, పార్వతి మీనా, విద్యార్థులు, వార్డు శానటరీ సెక్రటరీ ప్రమీల, హెల్త్ సెక్రటరీ శాంతాకుమారి, కోమలి, పుణ్యవతి, ఆశవర్కర్స్ ఇందిరా సరోజిని, రామలక్ష్మి పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

రణస్థలం : మండలంలో పాతర్లపల్లిలో వైసిపి నాయకులు లోలుగు కృష్ణ తండ్రి లోలుగు లక్ష్మినారాయణ శుక్రవారం మరణించారు. మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పరామర్శించిన వారిలో పాతర్లపల్లి పంచాయతీ సర్పంచ్ గొర్లె రాధాకృష్ణ, వైసిపి నాయకులు మహంతి అయ్య, పిన్నింటి శ్రీచరణ్, గొర్లె మంగయ్యగారి రమణ, మంత్రి శ్రీను తదితరులున్నారు.

మాజీ విసి అక్రమాలపై విచారణ చేయాలి

అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి- పొందూరు

అంబేద్కర్ యూనివర్శిటీ మాజీ ఉపకులపతి నిమ్మ వెంకటరావు చేపట్టిన అడ్డగోలు నియామకాలు, జరిగిన అవినీతి, అక్రమాలపై ప్రభుత్వం సంపూర్ణ విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని అంబేద్కర్ చైర్ సాధనాసమితి కన్వీనర్ టొంపల రమణ డిమాండ్ చేశారు. మండలం ధర్మపురంలో శుక్రవారం అంబేద్కర్ యూనివర్శిటీలో ఎస్‌సి, ఎస్‌టి, మహిళా వికలాంగుల, మైనార్టీల రూల్ ఆఫ్ రిజర్వేషన్లు అమలుకై నిరసన వ్యక్తం చేశారు. ఈ రిజర్వేషన్లు అమలు కోసం జూలై 1న నిర్వహించనున్న మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దళిత నాయకులు కోరారు. ప్రస్తుత విసి కె.ఆర్.రజని తనవైఖరి మార్చుకోవాలని, మాజీ విసి తన రిటైర్మెంట్‌కు ముందు చేపట్టిన అడ్డగోలు ప్రమోషన్లను రద్దుచేయాలని కోరారు. కార్యక్రమంలో దళిత నాయకులు సిహెచ్ రాజు, బి.రాజేష్, ప్రసాదరావు, కె.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు అండగా సోంపేట రోటరీ క్లబ్

ప్రజాశక్తి- సోంపేట

రోటరీ క్లబ్ చేపడుతున్న సేవా కార్యక్రమాల పట్ల స్థానికులు ఉద్దాన ప్రాంతవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని బాలికల వసతి గృహంలో 100 మంది విద్యార్థినులు ప్రతిరోజు జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాలకు, ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వెళుతుంటారు. గత రెండు రోజుల క్రితం పిల్లలందరూ వర్షంలో తడుచుకుంటూ వరుస క్రమంలో వసతి గృహానికి వెళ్తున్న పరిస్థితులు గమనించిన రోటరీ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ దుద్ది శ్రీనివాసరావు వెంటనే స్పందించి 100 గొడుగులను తెప్పించి బాలికలకు శుక్రవారం అందజేశారు. దీంతో పాటుగా బాలికలకు హెచ్‌బి పరీక్షలు నిర్వహించి రక్తం తక్కువగా ఉన్న బాలికలకు ఉచితంగా మందులను అందజేస్తూ వైద్య అధికారులతో ఆరోగ్య సూత్రాల కోసం పిల్లలకు అవగాహన కల్పించి విధిగా పాటించాలని తెలియజేశారు. వసతి గృహంలో పిల్లలకు ఎటువంటి

విద్యార్థులకు గొడుగులు పంపిణీ చేస్తున్న శ్రీనివాసరావు

ఇబ్బందులున్నా రోటరీ క్లబ్‌కు సమాచారం అందజేయాలని వసతి గృహ అధికారులకు తెలియజేశారు. రోటరీ అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కుటుంబ నేపథ్యాన్ని దృష్టిలో పెట్టుకొని లక్ష్యసాధనతో ఇష్టపడి చదువుకోవాలని ప్రభుత్వం సమకూరుస్తున్న వనరులను సరైన పద్ధతిలో సద్వినియోగపరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ లక్ష్మి

రహదారిపై చేపడుతున్న పారిశుధ్య పనులు

సరుబుజ్జిలి: పారిశుధ్య వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా మండలంలో ముమ్మరంగా పారిశుధ్య పనులను నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్న దృష్ట్యా గ్రామాల్లో ఎటువంటి అంటువ్యాధులు ప్రబలకుండా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా ఉన్నతాధికారులు పారిశుధ్య వారోత్సవాలను పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. సర్పంచ్‌లు, కార్యదర్శులు అపారిశుధ్య ప్రాంతాలను గుర్తించి పిచ్చి మొక్కల తొలగింపు, చెత్త ఎత్తివేతలు, తాగునీటి పరిసర ప్రాంతాల్లో క్లోరినేషన్, కాలువలో పూడికతీతలు చేపడుతున్నారు. శుక్రవారం మండల కేంద్రంలో రహదారులకు ఇరువైపులా పేరుకుపోయిన చెత్తను జెసిబి, ట్రాక్టర్ల సహాయంతో సర్పంచ్ బొడ్డేపల్లి చాందిని వెంకట సూర్య, కార్యదర్శి బి. అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు నిర్వహించారు.

పొందూరు: మేజర్ పంచాయతీ సర్పంచ్ రేగిడి లక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపట్టారు. పంచాయతీ పరిధిలో పలు కాలువల్లో మురుగునీరు, చెత్తాచెదారాలను జెసిబితో తొలగించి శుభ్రపరిచారు. కార్యక్రమంలో ఇఒ రమేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భార్యభర్తలను కలిపిన జూనియర్ సివిల్ జడ్జి

పిల్లలను అనాథలు చేయొద్దు

కోటబొమ్మాళి: భార్యాభర్తలిద్దరూ చిన్న చిన్న సమస్యలతో విభేదాలకు పోయి విడిపోవడం మంచిది కాదని దానివలన మీ జీవితాలతో పాటు మీ పిల్లలు జీవితాలు ఇబ్బందుల్లో పడతాయని మండల న్యాయ సేవాసంఘం అధ్యక్షులు, జూనియర్ సివిల్ జడ్జి బి.ఎం.ఆర్. ప్రసన్నలత అన్నారు. శుక్రవారం స్థానిక కోర్టు ఆవరణలో వరకట్న నిషేధ విషయాల కేసులు, భార్యాభర్తల కేసులపై చర్చలు జరిపి ఐదు జంటలను కలిపారు. భార్యాభర్తలు ఇద్దరు సంతోషంగా జీవితాన్ని గడపడానికి, పిల్లలతో సుఖంగా ఉండే విధంగా న్యాయమూర్తి కోర్టులోనే వారికి దండలు మార్పించి వారికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షులు లకినేని శ్రీనివాసులు, ఎపిపి హరిప్రియ, ఎజిపి ఎస్.తిరుపతి, సీనియర్ న్యాయవాదులు సిహెచ్ వెంకట్రావు, వెలమన అప్పలనాయుడు, యు.తిరుమలరావు, వై. వెంకటరావు, కె.మన్మథరావు, పల్లి వాసుదేవరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న శోభారాణి

పరిసరాల పరిశుభ్రతపై దృష్టి

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తద్వారా, వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్త వహించాలని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిణి శోభారాణి అన్నారు. నగరంలోని బలగ సెక్టార్ లో ఉన్న సానావీధి 1,2 అంగన్వాడీ కేంద్రాల పరిధిలో ఇంటింటికి వెళ్లి వర్షాకాలంలో ప్రబలే వ్యాధులపై వివరించారు. రానున్న మూడు నెలలు వర్షాకాలం కావున ఇంటింటికి వెళ్లి జాగ్రత్తలను వివరించారు. ముఖ్యంగా ఇంటి పరిసరాల్లో నిలువ నీటిని ఉంచరాదని చెప్పారు. నిల్వ నీటి ద్వారా దోమలు ఎక్కువగా ప్రబలే అవకాశం ఉందన్నారు. వ్యాధులపై అవగాహన కల్పిస్తూ ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ యశోద, హెచ్‌వి బి.లక్ష్మి, ఎఎన్ఎం సూర్యం, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ మీటర్ రీడర్స్ వినతి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

విద్యుత్ మీటర్ రీడర్స్ అసోసియేషన్ సభ్యులు, వాలంటీర్లు కలిసి తమ వినతిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఇచ్ఛాపురం జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన ఇన్‌ఛార్జి దాసరి రాజుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. విద్యుత్ మీటర్ రీడర్స్ అసోసియేషన్‌లో పనిచేస్తున్న సభ్యులు అప్పటి టిడిపి హయాంలో నెలరోజులు పనిదినాలు కల్పించేలా జిఒ ఇవ్వడం జరిగిందని, మళ్లీ వైసిపి ప్రభుత్వంలో టిడిపి ఇచ్చిన జిఒ చెల్లుబాటు కాదని మాకు ఇచ్చిన వేతనాల్లో కూడా వైసిపి కాంట్రాక్టర్లు దోపిడీకి పాల్పడి కక్ష సాధింపు చర్యలకు పాల్పడి పనిదినాలు తగ్గించి మా కడుపు కొట్టారని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ సమస్యను జనసేన అధినేత పవన్ కళ్యాణ్ దృష్టికి, సిఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. అలాగే నియోజకవర్గ మాజీ వాలంటీర్లు వైసిపి ప్రభుత్వం ఒత్తిడి తీసుకువచ్చి మమ్మల్ని రాజీనామా చేయించారని, మరలా తమను విధుల్లోకి తీసుకోవాలని వినతిపత్రం సమర్పించారు.